# కాంగ్రెస్, బీజేపీని నమ్మితే మోసపోతం

- నమ్మితే మోసపోవుడు ఖాయం
- మ్యానిఫెస్టోపై విస్తృతంగా చర్చించాలి
- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో 70 మంది చేరిక

ధర్మపురి, అక్టోబర్ 19: రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు శనిలా దాపురించినయి. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలువాలని కొత్త ఎత్తుగడలతో వస్తున్నయి. నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నయి. ఆచరణ సాధ్యంకాని హామీలు ఇస్తున్నయి. వాళ్లను నమ్మొద్దు. నమ్మితే మోసపోవుడు ఖాయం. అప్రమత్తంగా లేకపోతే గోసపడుతం' అంటూ మంత్రి ఈశ్వర్ కొప్పుల ఈశ్వర్ ప్రజలకు సూచించారు. గురువారం ధర్మపురి మండలం ఆరెపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు 70 మంది కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల కార్డు ఓ సంతకం లేని పోస్ట్‌డేటెడ్ చెక్కులాంటిదని ఎద్దేవా చేశారు. వాళ్లను నమ్మితే తెలంగాణ మళ్లీ అంధకారం అవుతుందని, నాడు ఏండ్ల కొద్ది పాలించి ఏం చేశారో మనం చూడలేదా..? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం అని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని చెప్పారు. పార్టీకి కార్యకర్తలే పునాది అని, సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్ గెలుపునకు కృషిచేయాలని సూచించారు. పేదల అభ్యున్నతి, సంక్షేమం కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టో పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ఇందులో ప్రధానంగా అర్హులైన మహిళలకు ₹3వేల భృతి, ₹400కే వంటగ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ మొత్తాన్ని ₹5లక్షల నుంచి ₹15లక్షలకు పెంచడం, తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం, ఆసరా పింఛన్లు పెంచడం, పేద కుటుంబాలకు ₹5లక్షల బీమా, రైతుబంధు కింద పంట పెట్టుబడి సాయం పెంచడం లాంటి పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా చర్చ జరగాలన్నారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి ఈశ్వర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. సర్పంచ్ బోర్లకుంట కమల-రాజన్న, ఎంపీటీసీ కుంబాల రవిత-రమేశ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అద్యక్షుడు పిస్కతిరుపతి, బీఆర్ఎస్ నాయకులు రేగొండ మహేశ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు చెప్పారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యోగా సభ్యులు

## జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

ధర్మారం,అక్టోబర్19: కరీంనగర్‌లో పతంజిలి యోగా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన యోగా మాస్టర్ జంగిలి సుధాకర్, ఈగం ప్రసాద్, బెంగళూరు బేకరి కవిత, స్వర్ణలత పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 30-35 ఏండ్ల వయస్సు కేటగిరీలో ద్వితీయ స్థానంలో బెంగళూరు బేకరి కవిత, 35-45 లోపు యేండ్ల కేటగిరీలో పీ స్వర్ణలత ద్వితీయ, 35-45లోపు యేండ్ల కేటగిరీలో యోగా మాస్టర్ సుధాకర్ 4వ స్థానం, 45-55 ఏండ్ల కేటగిరీలో ఈగం ప్రసాద్ 4వ స్థానం సాధించారు. వీరు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికవడంపై ధర్మారం పతంజలి యోగా మాస్టర్ దంపతులు జంగిలి మంజుల- సుధాకర్ హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 19: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమన్వయంతో పార్టీ మరింత బలోపేతమే లక్ష్యంగా పార్టీ శ్రేణులందరినీ భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బూత్‌స్థాయి ఏజెంట్ నుంచి గ్రామ శాఖ, వార్డు అధ్యక్షులు, మండల, పట్టణ అధ్యక్షులు తదితరులు ఆక్టివ్‌గా పని చేయాలని, రానున్న 40 రోజుకు చాలా కీలకం అని సూచించారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్ కుమార్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మరోసారి జగిత్యాలలో గులాబీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అర్బన్ మండల జడ్పీటీసీ మహేశ్, బీఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ వేడుకలకు స్థల పరిశీలన



ఏర్పాట్లపై వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

కోరుట్ల, అక్టోబర్ 19: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మినీ స్టేడియంలో ఈనెల 21న భారత జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ వేడుకల స్థలాన్ని గురువారం జాగృతి రాష్ట్ర నాయకులు పరిశీలించారు. నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బతుకమ్మ వేడుకల్లో పాల్గొననుండగా, మైదానంలో వసతులు, ఏర్పాట్లపై స్థానిక బీఆర్ఎస్ నాయకులతో సమీక్షించారు. బతుకమ్మ వేడుకల కోసం అవసరమైన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఇక్కడ జాగృతి రాష్ట్ర నాయకుడు కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు కొండ యుగేంధర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు సేనాపతి రాజు, నీలి శ్రీనివాస్, యూత్ ప్రధాన కార్యదర్శి పుప్పాల నాగరాజు, రాజ్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీల్లో నగదు, చీరల పట్టివేత

మల్లాపూర్, అక్టోబర్ 19: జిల్లా సరిహద్దులోని ఓబులాపూర్ గ్రామశివారులో పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా నిర్మల్ జిల్లాలోని గోసంగిపల్లికి చెందిన ఓ వ్యక్తి దగ్గర రూ. 90 వేల నగదు, ఇచ్చోడకు చెందిన ఓ వ్యక్తి దగ్గర 139 చీరలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఇక్కడ సిబ్బంది అశోక్, కోటేశ్వర్ రాజు, సుదర్శన్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



చెక్‌పోస్ట్ వద్ద పట్టుబడ్డ చీరలతో ఎస్ఐ నవీన్‌కుమార్, సిబ్బంది

## అయితుపల్లిలో బీఆర్ఎస్ జెండావిష్కరణ

పెగడపల్లి, అక్టోబర్ 19: అయితుపల్లి గ్రామంలో గురువారం పార్టీ నాయకులు బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మంత్రి ఈశ్వర్ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై శుక్రవారం నుంచి ఇంటింటి ప్రచారం చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఇక్కడ సర్పంచ్ జిట్టబోయిన కొండయ్య, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు ఉప్పుగండ్ల నరేందర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ రహీం, గ్రామ శాఖ అధ్యక్షుడు ద్యావ వెంకట్‌రెడ్డి, నాయకులు గోలి సురేందర్ రెడ్డి, తోట మోహన్‌రెడ్డి, బండి వెంకన్న, వడియాల గోపాల్‌రెడ్డి, పలుమారు విజయ్‌యాదవ్, తడగొండ సాగర్, ఎండీ జానీపాషా, జెరిపోతుల శ్రీనివాస్, నర్సయ్య తదితరులున్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శన

జగిత్యాల, అక్టోబర్ 19: జిల్లా కేంద్రంలోని స్థానిక విద్యానగర్‌లోని రామాలయం ప్రాంగణంలో నారాయణి దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారులతో ఏర్పాటు చేసిన భరత నాట్య, కూచిపూడి కళా ప్రదర్శన వీక్షకులను ఎంతగానో అలరించింది. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కచ్చు హరీశ్, ఠాకూర్ ప్రభాత్ సింగ్, కటారి వంశీకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకుడు రంజిత్ ఆచార్య, నాట్య గురువు బొమ్మిడి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థల పరిశీలన

మల్యాల, అక్టోబర్ 19: మండల కేంద్రంలో గల మల్లె కుట్ట సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో కృషి విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించేందుకు కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నీరజ ప్రభాకర్, డీన్ కిరణ్ కుమార్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మల్యాల సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.ఇక్కడ పలువురు ఉన్నారు.

# దుర్గామాతకు ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: జిల్లా కేంద్రంలోని నవదుర్గా, కనకదుర్గా, వనదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో బోనాల పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఇంటి నుంచి ఊరేగింపుగా డప్పు చప్పుళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. ఈ బోనాల కార్యక్రమంలో సుమారు పది వేల మంది భక్తులు పాల్గొన్నారు. వీరికి మండపాల నిర్వాహకులు అన్నదానం చేశారు.

ధర్మపురి, అక్టోబర్ 19: ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామివారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో గురువారం పండితులు మంత్రోచ్ఛారణలతో పూజలు నిర్వహించారు. ఐదో రోజైన గురువారం అమ్మవారు స్కంధమాత రూపంలో దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించగా శాఖాంబరీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

యోగ, ఉగ్ర నారసింహస్వామివారల ఉత్సవ మూర్తులను శేష వాహనం పై ఉంచి పట్టణ వీధుల గుండా మేళతాళాలు వెంట రాగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం రామలింగేశ్వరాలయంలోని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, రెనొవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, ఇనగంటి రమ-వెంకటేశ్వరరావు, గందె పద్మ-శ్రీనివాస్, అక్కెనపల్లి సురేందర్, వీరవేని కొమురయ్య, చుక్క రవి, స్తంభంకాడి మహేశ్, గునిశెట్టి రవీందర్, వేముల నరేశ్, పల్లెర్ల సురేందర్, రాజమౌళి, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, వేద పారాయణదారులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్‌శర్మ, ఉప ప్రధానార్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, సీహెచ్ రమణయ్య, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథశర్మ, బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్‌శర్మ తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 19: వేములకుర్తిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీ మండపంలో అమ్మవారు గురువారం శాఖాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే భర్తీపూర్‌లో వేదపండితులు గోపీకృష్ణ, రొట్టె కిషన్ శర్మ ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో సర్పంచ్ నేమూరి లత ఆధ్వర్యంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు సంగం సాగర్, సున్నం నవ్యశ్రీ, దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్, అక్టోబర్ 19: మండలకేంద్రంలోని దుర్గాదేవీ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జగిత్యాల టౌన్ : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక్కడ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్, అక్టోబర్ 19: పట్టణంలోని ఆయా కుల, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గా మండపాల్లో నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా అమ్మవారు శాఖాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. త్రిశక్తీ ఆలయంలో దుర్గామాతను సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే దుర్గామాతకు మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ద్యావనపల్లి రాజారాం, నాగరాజు, గుంటుక శ్యాం, భానుమూర్తి, శివాజీ, శివ, గుజ్జేటి శ్రీనివాస్, భాస్కర్, అమరేందర్, ఆర్యవైశ్య, త్రిశక్తీ ఆలయ కమిటీ సభ్యులు, ఆయా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి, అక్టోబర్ 19: పెగడపల్లి, నందగిరి, నంచర్ల, బతికపల్లి, రాజారాంపల్లి, కీచులాటపల్లి, ఆరవల్లి తదితర గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంతో పాటు, నందగిరిలో ప్రతిష్ఠించిన దుర్గామాత మండపాల్లో మహిళలతో కుంకుమ పూజలు నిర్వహించారు.